సాక్షి అన్నమయ్య జిల్లా

బుధవారం । 22 । నవంబర్ । 2023



నిధులు మంజూరు

జిల్లాలోని 717 అంగన్‌వాడీ కేంద్రాలకు మరమ్మతులకు సంబంధించి నిధులు మంజూరు చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించిందని ఐసీడీఎస్ పీడీ, డీపీఓ ధనలక్ష్మి తెలిపారు. -8లో



నకిలీ బంగారు ముఠా అరెస్టు

బంగారును తక్కువధరకు అమ్మేస్తామని ఆశ చూపి, డబ్బు కాజేసేందుకు ప్రయత్నించిన నకిలీ బంగారు ముఠాసభ్యుల గుట్టును పోలీసులు రట్టుచేశారు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.270	రూ.360
రెండోరకం	రూ.160	రూ.268



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 305 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	395	453
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 397.040 కిలోలు

న్యూస్‌రీల్

నేడు 'జగనన్నకు చెబుదాం'

ఓబులవారిపల్లె: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ ప్రాంగణంలో బుధవారం 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ విజయారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు, జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ తదితరులు పాల్గొననున్నారని తెలిపారు. ప్రజలు తమ సమస్యలను వీరి దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలన్నారు.

రేపు జాబ్‌మేళా

కడప కోటిరెడ్డిసర్కిల్: జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థతో కలిసి గురువారం ఉదయం 10.00 గంటలకు కలెక్టరేట్‌లోని తమ కార్యాలయంలో పలు కంపెనీలతో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి సురేష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ, పీజీ ఉత్తీర్ణులైన వారు(18–35 సంవత్సరాల మధ్య వయస్సు) అర్హులన్నారు. ఎంపికైన వారికి హోదాను బట్టి రూ.13వేల నుంచి 25 వేల వరకు వేతనం ఉంటుందన్నారు. ఆసక్తిగల వారు తమ ధృవపత్రాలు తీసుకుని జాబ్‌మేళాకు హాజరు కావాలన్నారు.

రాష్ట్ర రగ్బీ జట్టుకు ఎంపిక

కడప స్పోర్ట్స్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో భువనేశ్వర్‌లో డిసెంబర్ నెలలో నిర్వహించనున్న ఎస్‌జీఎఫ్ రగ్బీ అండర్–14 బాలుర విభాగంలో పాల్గొనే ఏపీ జట్టుకు కడప నగరానికి చెందిన ఎస్. పునీత్ రాజ్ ఎంపికయ్యాడు. నగరంలోని చెమ్ముమియాపేట బాలుర ఉన్నత పాఠశాలలో చదువుతున్న పునీత్‌రాజ్ ఇటీవల కర్నూలులో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి రగ్బీ అండర్–14 విభాగంలో చక్కగా రాణించి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా క్రీడాకారున్ని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు గిరిజాకుమారి, ఫిజికల్ డైరెక్టర్ ఎం. ప్రవీణ్‌కిరణ్ అభినందించారు.

నిత్యాన్నదానానికి రూ.లక్ష

చక్రాయపేట: గండి వీరాంజనేయ స్వామి సన్నిధిలో జరిగే శాశ్వత నిత్యాన్నదాన పథకానికి రూ.1,00,116లు విరాళంగా వచ్చినట్లు ఆలయ సహాయ కమిషనర్ అలవలపాటి ముకుందరెడ్డి తెలిపారు. కడప నగరం ఓంశాంతి నగర్‌కు చెందిన గోశెట్టి తిమ్మగారి మదన్ కుమార్ జ్ఞాపకార్థం వారి తల్లిదండ్రులు చిన్న మాదన్న,రమాదేవి దీనిని అందజేశారన్నారు. ఈ సందర్భంగా దాతలచే ప్రత్యేక పూజలు చేయించి స్వామి చిత్రపటం, శేషవస్త్రంతో సత్కరించినట్లు తెలిపారు.

నూతన నియామకం

వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణ విభాగంలో అదనపు అధికారులను మంగళవారం నియమించారు. వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్, రిజిస్ట్రార్ ఆచార్య వై.పి.వెంకటసుబ్బయ్యలు నూతన అధికారులుగా నియమితులైన డా॥ఎం.మమతకుమారి (మెటీరియల్‌సైన్స్ అండ్ నానోటెక్నాలజీ), డా॥ కె.శ్రీనివాసరావు (కంప్యూటర్ సైన్స్ అండ్ టెక్నాలజీ)లకు నియామక పత్రాలను అందజేశారు. ఇప్పటి వరకు ఈ స్థానంలో పనిచేసిన డా॥ఎస్. ఆదినారాయణరెడ్డి, డా॥ఎస్.సుమిత్రల పదవీకాలం పూర్తికావడంతో పైవారిని నియమించారు. కార్యక్రమంలో పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య ఎస్.ఈశ్వరరెడ్డి పాల్గొన్నారు.

ప్రకృతి గాయానికి ప్రభుత్వ చికిత్స

- రెండేళ్ల కిందట అన్నమయ్య, పింఛా మట్టికట్టలు తెగిపోవడంతో ఉప్పొంగిన వరద
- బాధితులకు పరిహారం పంపిణీ
- చెయ్యేరుకు రెండు వైపులా రక్షణ గోడల నిర్మాణం

సాక్షి రాయచోటి: అన్నమయ్య, పింఛా డ్యాం బాధితులకు వైఎస్ జగన్ ప్రభుత్వం ఆసరాగా నిలిచింది. ప్రకృతి సృష్టించిన బీభత్సంలో ఇబ్బందులు పడుతున్న ప్రజలకు వెన్నంటి నిలిచింది. గాయం ప్రకృతి చేసినా... ప్రభుత్వం మాత్రం ప్రత్యేక సాయంతో అండగా నిలబడింది. ప్రతిపక్షాలు, ఎల్లోమీడియా అనేక రకాలుగా దుష్ప్రచారం చేసినా ప్రభుత్వం మాత్రం ప్రజలకు వెంటనే సహాయక చర్యలు చేపట్టింది.

వరద గ్రామాలకు భరోసా

అన్నమయ్య, పింఛా మట్టికట్టలు తెగిపోయి వరద నీటి ప్రవాహంలో చిక్కుకుని బయటపడిన గ్రామాలకు ప్రభుత్వం ఇతోధికంగా సాయం అందించింది. సుమారు 11 గ్రామాల్లో వరద నీటి ప్రవాహం కనిపించినా ప్రధానంగా పులపత్తూరు, మందపల్లె, తొగురుపేట, శేషమాంబపురం, గుండ్లూరు తదితర ప్రాంతాలను కుదిపేసింది. దాదాపు 376 పశువులు చనిపోయిన నేపథ్యంలో సుమారు రూ. 14 కోట్ల మేర పరిహారం అందించారు. అలాగే ఇళ్లకు సంబంధించి పూర్తిగా ఇళ్లు కోల్పోయిన వారికి ప్రత్యేకంగా ఐదు సెంట్ల స్థలంతోపాటు రూ. 5 లక్షలతో ఇంటి నిర్మాణానికి ఇచ్చిన హామీ మేరకు నిర్మిస్తున్నారు. ఇప్పటికే చాలా గృహాలు పూర్తి కాగా, మరికొన్ని శ్లాబ్ స్థాయికి చేరుకున్నాయి. అలాగే ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి ఇంటికి రూ. 10 వేలు చొప్పున సొంత నిధులు అందించడంతోపాటు మృతి చెందిన కుటుంబాలకు కూడా రూ. లక్ష చొప్పున అందించారు. జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి కోటాలో గ్రామీణ ప్రాంతాల్లోని రోడ్లు, ఇతర అభివృద్ధి పనులు చేపట్టారు. మందపల్లె, తొగురుపేట, శేషమాంబపురం, గండ్లూరుతోపాటు ఇతర ప్రాంతాల్లో పూర్తిగా ఇసుకను తొలగించారు. రైతులకు సంబంధించి ఉద్యాన, వ్యవసాయ పంటల నష్టపరిహారం కింద సుమారు రూ. 4.45 కోట్ల మేర అందించారు. అంతేకాకుండా వరదలో మృతి చెందిన దాదాపు 33మందికి సంబంధించి ప్రభుత్వం ఒక్కొక్కరికీ రూ. 5 లక్షలు చొప్పున రూ. 1.65 కోట్ల మేర సొమ్మును కేవలం 10–15 రోజుల్లోనే అందించారు.



మందపల్లెలో వేసిన సిమెంటు రోడ్డు

డ్వాక్రా మహిళలకు రుణమాఫీ

వరద బీభత్సానికి పలు గ్రామాల్లోని డ్వాక్రా మహిళలకు ఆయా గ్రామాల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పర్యటించిన సందర్భంలో ఇచ్చిన హామీలను నెరవేర్చారు. ఇసుక మేటలు తొలగిస్తామని ఇచ్చిన హామీతోపాటు ఇళ్లు, ఉచిత పట్టాల హామీలను ముఖ్యమంత్రి నెరవేర్చారు. అలాగే 189 డ్వాక్రా గ్రూపులకు సంబంధించి 1890 సభ్యులకు రుణమాఫీ కింద రూ. 8.98 కోట్లు విడుదల చేసి ఆదుకున్నారు.

రక్షణ గోడలు

అన్నమయ్య, పింఛా డ్యాముల మట్టికట్టలు తెగిపోయి వరద బీభత్సం సృష్టించిన అనంతరం ఎక్కడికక్కడ రక్షణ గోడలకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. తొగురుపేట, మందపల్లె, పులపత్తూరు వద్ద చెయ్యేరు నుంచి వరద నీరు ఇటువైపుగా రాకుండా మట్టితో కట్టలు నిర్మించారు. ఎక్కడికక్కడ గ్రామాల్లో తెగిపోయిన రోడ్లు, గ్రామాలమధ్య వరదతో పూర్తిగా దెబ్బతిన్న రోడ్లను మళ్లీ పూర్తి స్థాయిలో తీర్చిదిద్దారు.



మందపల్లె సమీపంలో ఇసుక మేటలు తొలగింపు అనంతరం పంటలకు అనుకూలంగా భూమి

అన్నమయ్య, పింఛా ప్రాజెక్టులకు కొత్త రూపు

రాజంపేట పరిధిలో అన్నమయ్య ప్రాజెక్టుతోపాటు పింఛా ప్రాజెక్టులకు కొత్తరూపు తీసుకు వస్తున్నారు. ప్రధానంగా అన్నమయ్య ప్రాజెక్టుకు సంబంధించి 25 గేట్లతో భారీ ఎత్తున నీటి నిల్వ ఉండేలా సుమారు రూ. 787 కోట్లతో ప్రాజెక్టుకు కొత్త రూపు తెచ్చారు. ఈ ప్రక్రియలో టెండర్ల దశలో ఉంది. అలాగే పింఛా ప్రాజెక్టుకు సంబంధించి రూ. 83 కోట్లతో ప్రస్తుతం పనులు కూడా జరుగుతున్నాయి. ప్రస్తుతం కాంక్రీట్ పనులు పూర్తి చేసుకుని ప్రాజెక్టుకు సంబంధించి ఇతర పనులు వేగంగా కొనసాగుతున్నాయి.

వేగంగా ప్రాజెక్టు పనులు

పింఛా ప్రాజెక్టు పనులు కొనసాగుతుండగా, అన్నమయ్య డ్యామ్‌ను కూడా అత్యాధునికంగా నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. సీఎం స్వయంగా పర్యటించి బాధితుల కష్టాలు తెలుసుకుని వేగవంతంగా ప్రజలు సాధారణ స్థితికి వచ్చేలా సాయం అందించారు. పశువులు, మేకలకు, పంట పొలాలకు ఇలా అన్నింటికి పరిహారం అందించారు. మృతిచెందిన వారికి సంబంధించిన పరిహారం రూ.5 లక్షలు చొప్పున ప్రభుత్వం అందించింది.

– మేడా వెంకట మల్లికార్జునరెడ్డి, ఎమ్మెల్యే, రాజంపేట

వరద బాధితులకు అండగా ప్రభుత్వం

వరద మిగిల్చిన గాయం అనంతరం అధికార యంత్రాంగంతోపాటు ప్రజాప్రతినిధులు అక్కడే నెలరోజులపాటు ఉండి ప్రజలు కోలుకునేలా చర్యలు తీసుకున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కూడా పర్యటించి వారి బాధలు తెలుసుకోవడంతోపాటు ఇచ్చిన హామీలను నెరవేర్చారు. జిల్లా పరిషత్ నిధులతో రోడ్లు, ఇతర పనులు పూర్తి చేయించాం.

– ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, జెడ్పీ చైర్మన్

అన్ని విధాలుగా ఆదుకున్నాం

ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలను ప్రభుత్వం ఒక్కొక్కటిగా అమలు చేసింది. వరద తాకిడికి గురై మృతి చెందిన వారి కుటుంబాలకు పరిహారం అందించాం. మూగ జీవాల మృతి, ఇసుక మేటల తొలగింపు, ఇతరత్రా సదుపాయాల కల్పనకు ఆయా గ్రామాల్లో రూ. 22 కోట్ల మేర ఖర్చు చేశాం. జాబ్‌మేళాల ద్వారా ఉద్యోగాల కల్పనకు కృషి చేశాం. ప్రాజెక్టులు కొత్త హంగులు సంతరించుకోనున్నాయి.

– పీఎస్ గిరీషా, జిల్లా కలెక్టర్

నేడు ప్రాజెక్టు భూముల పరిశీలన



సోమవారం రైతుల నుంచి ఫిర్యాదులను స్వీకరిస్తున్న ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి (ఫైల్)

వీరబల్లి (రాయచోటి టౌన్): వంగిమళ్ల సమీపంలో ఏర్పాటు చేస్తున్న పవర్ ప్రాజెక్టు కోసం సేకరిస్తున్న భూములకు చెందిన రైతులతో చర్చించేందుకు బుధవారం జిల్లా కలెక్టర్ గిరీషా వస్తున్నట్లు రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జున రెడ్డి తెలిపారు. సోమవారం వై నీడ్ జగన్ కార్యక్రమంలో ఎమ్మెల్యే మండలంలోని పలు గ్రామాలలో పర్యటించారు. ఈ పర్యటనలో భాగంగా వంగిమళ్లలోని పవర్ ప్రాజెక్టు రైతులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తమకు చెల్లించే నష్టపరిహారంలో నష్టం జరుగుతోందని రైతులు ఆయన దృష్టికి తీసుకెళ్లడంతో వెంటనే జిల్లా కలెక్టర్‌తో ఫోన్ ద్వారా చర్చించారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ బుధవారం వంగిమళ్ల పవర్ ప్రాజెక్టుకు సంబంధించి రైతుల సమస్యలను తెలుసుకొనేందుకు వస్తున్నారని ఎమ్మెల్యే తెలిపారు.

శబరిమలైకి ప్రత్యేక రైళ్లు

కడప కోటిరెడ్డిసర్కిల్ : అయ్యప్ప భక్తుల సౌకర్యార్థం కడప మీదుగా శబరిమలైకి రెండు ప్రత్యేక రైళ్లు నడపనున్నారని కడప రైల్వే చీఫ్ టిక్కెట్ ఇన్‌స్పెక్టర్ ఉమర్‌బాషా తెలిపారు. సికింద్రాబాద్ నుంచి కొల్లాం (07131)కు డిసెంబరు 10, 17 తేదీల్లో, అలాగే తిరుగు ప్రయాణంలో ఈ రైలు (07132) కొల్లాం నుంచి సికింద్రాబాదుకు డిసెంబరు 12, 19 తేదీల్లో నడుస్తుందని పేర్కొన్నారు. ఈ రైలు కాచిగూడ, డోన్, గుత్తి, కడప, రేణిగుంట, మెట్‌పాలెం మీదుగా వెళుతుందన్నారు. మరో ప్రత్యేక రైలు సికింద్రాబాద్ నుంచి కొల్లాం (07133) వచ్చే జనవరి 7న వికారాబాద్, గుంతకల్లు, కడప, రేణిగుంట మెట్‌పాలెం మీదుగా వెళుతుందన్నారు. ఈ రైలు తిరుగు ప్రయాణంలో(07134) జనవరి 9న కొల్లాం నుంచి వికారాబాద్ చేరుతుందన్నారు.

పారదర్శక ఓటరు జాబితా లక్ష్యం

- 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావాలి
- కలెక్టర్ గిరీషా పీఎస్

రాయచోటి : తప్పులు లేని స్వచ్ఛమైన ఓటరు జాబితా రూపకల్పనకు సంబంధిత అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని కలెక్టర్ గిరీషా పీఎస్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్సు హాల్‌లో కలెక్టర్ గిరీషా పీఎస్ ఓటరు జాబితాను సవరణపై తహశీల్దార్‌లు, బీఎల్‌ఓలతో వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఓటరు జాబితాలో చిన్నపొరపాటు కూడా జరగకుండా ఓటరు జాబితాను తయారు చేయాలన్నారు. రాష్ట్ర ఎన్నికల కమీషన్ విధి విధానాల మేరకు జిల్లాలో ఓటర్ జాబితాకు సంబంధించిన కార్యక్రమాలు ప్రణాళికాబద్ధంగా పూర్తి చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల స్థితి, ఓటర్ల జనాభా నిష్పత్తి, లింగ నిష్పత్తి, రాజకీయ పార్టీల ఫిర్యాదులు, ఎపిక్ కార్డులు వంటి అంశాలపై తీసుకోవాల్సిన చర్యలు గురించి కలెక్టర్ దిశా నిర్దేశం చేశారు. జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, డీఆర్‌ఓ సత్యనారాయణ, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.



ఓటరు జాబితా సవరణపై తహశీల్దార్‌లు బీఎల్‌ఓలతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్

'ఓటరు జాబితా'ను క్లియర్ చేయాలి

పీలేరు: ఓటరు జాబితా అన్ని ఫామ్స్ పెండింగ్ లేకుండా చూడాలని కలెక్టర్ గిరీషా అన్నారు. మంగళవారం స్థానిక డిప్యూటీ కలెక్టర్ కార్యాలయంలో ఓటర్ జాబితాకు సంబంధించి పీలేరు నియోజకవర్గంలోని ఆరు మండలాల తహశీల్దార్లు, అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పీలేరు మండలంలో పెండింగ్ ఫామ్స్ ఎక్కువగా ఉన్నాయని అసంతృప్తి వ్యక్తం చేశారు. బీఎల్‌వోలు ఒకటికి రెండు సార్లు వెరిఫై చేసి తప్పు లేని ఓటర్ జాబితా రూపొందించాలని ఆదేశించారు. హంద్రీనీవా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ గోపాలకృష్ణ, తహశీల్దార్‌లు ధనుంజయలు, నరసింహులు, భాగ్యలత, ఖాజాబీ, ప్రదీప్, ఫిరోజ్‌ఖాన్, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

మత్స్యకారుల అభివృద్ధికి విశేష కృషి

రాయచోటి: రాష్ట్ర ప్రభుత్వం మత్స్యకారుల అభివృద్ధికి విశేషంగా కృషి చేస్తోందని కలెక్టర్ గిరీషా పీఎస్ పేర్కొన్నారు. ప్రపంచ మత్స్యకార దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మత్స్యకారుల అభివృద్ధి సందేశాన్ని అందించారు. జిల్లా కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్సు హాల్‌లో జిల్లా కలెక్టర్ గిరీషా, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, మత్స్య శాఖ ఏడీ సుస్మిత తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మత్స్యసంపదను పెంచడానికి మత్స్యకారులకు మత్స్యవ్యాపారాలు సజావుగా చేసుకొని ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తోందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ అవకాశాలను మత్స్యకారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన పథకం క్రింద 60శాతం సబ్సిడీతో పదిలక్ష లూపాయలతో డైలీ రెగ్యుల్ యూనిట్ షాపు నిర్వహించేందుకు ఆరు లక్షల రూపాయల చెక్కును రైల్వేకోడూరు మండలం అనంతరాజుపేటకు చెందిన మునెమ్మకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మత్స్యశాఖ ఏడీ రెడ్డయ్య, ఎఫ్‌డీఓలు మోహన్ కృష్ణ, సుబ్బనరసయ్య, విఎఫ్ఏలు, మత్స్య సహకార సంఘం సభ్యులు పీఎంఎంఎస్‌వై లబ్ధిదారులు పాల్గొన్నారు.

లక్షణమైన జీవితం



పరాయి దేశాల్లో లక్షణమైన ఉద్యోగం.. నెలతిరిగేసరికి లక్షల రూపాయల జీతం ఒళ్లోకొచ్చి వాలేవి.. అవేవీ అతనికి సంతృప్తి ఇవ్వలేదు.. సొంతూరికి మించింది ఏదీ లేదనుకున్నాడు. అంతే ఊళ్లోకొచ్చి వాలిపోయాడు. మెకానికల్ ఇంజినీర్ హోదాను పక్కనబెట్టి పొట్టేళ్ల పెంపకానికి శ్రీకారం చుట్టాడు. కష్టేఫలి సూత్రాన్ని మంత్రంగా చేసుకుని అడుగు ముందుకేశాడు. ఇప్పుడూ లక్షల రూపాయాలు ఆర్జిస్తున్నాడు.. కాకపోతే పరాయి దేశంలో కాదు సొంతూరిలో.. ఒకరి వద్ద కూలీగా కాదు.. యజమానిగా.. కురబలకోటకు చెందిన మోహన్ కుమార్ రెడ్డి విజయగాథపై కథనం.

- పొట్టేళ్ల పెంపకంలో రాణిస్తున్న మెకానికల్ ఇంజనీర్
- వినూత్న పద్ధతిలో ఎలివేషన్ షెడ్డు
- ఇంటి వద్దే ఉంటూ లక్షల ఆదాయం

కురబలకోట: కురబలకోట మండలంలోని మధ్యాహ్నంవారిపల్లెకి చెందిన మెకానికల్ ఇంజినీరు బి. మోహన్ కుమార్ రెడ్డి పొట్టేళ్ల పెంపకంలో రాణిస్తున్నాడు. దేశంలోని ప్రధాన నగరాలైన బెంగళూరు, హైదరాబాదు, చెన్నైతో పాటు గల్ఫ్‌లోని ఖత్తర్‌లో కూడా మెకానికల్ ఇంజినీర్ హోదాలో ఉద్యోగం చేశాడు. నెలకు రూ. 1. 5 లక్షలకుపైగా జీతం వచ్చేది. ఎంత చేసినా ఎన్ని చేసినా ఉన్న ఊరికి సాటిరాదని గుర్తించాడు. అంతే ఉద్యోగానికి గుడ్‌బై చెప్పేశాడు. దేశంలోని వివిధ ప్రాంతాలతో విత్తన పొట్టేళ్ల పిల్లల పెంపకం గురించి కళ్లారా చూశాడు. ఊరుకాని ఊరిలో ఎవరి వద్దో పని చేయడం ఎందుకని రెండేళ్ల క్రితం స్వగ్రామం చేరుకున్నాడు.

రూ. 14 లక్షలతో షెడ్డు ..

ఊరి వద్దే పొలం పక్కన రూ. 14 లక్షలతో ఎలివేషన్ షెడ్డు వేశాడు. గొర్రెల మేతకు అవసరమయ్యే గడ్డిని మూడు ఎకరాల్లో వేశాడు. దీన్ని కట్ చేయడానికి కట్టర్ తెచ్చాడు. తనే స్వయంగా గడ్డి కత్తిరించి రోజుకు మూడు సార్లు వాటికి వేసి మేపుతున్నాడు. మేలు జాతి పొట్టేళ్ల పిల్లలను నెల్లూరు జిల్లా గూడూరు నుంచి జుడిపి జాతి పిల్లలను తెచ్చి ఇక్కడ మేపుతున్నాడు. ఎంపికలో జాగ్రత్త వహిస్తాడు. ఇప్పుడు రూ. 6 లక్షలు విలువ చేసే 50 దాకా పొట్టేళ్లు ఉన్నాయి. కిలో 550 చొప్పున లైవ్ వెయిట్‌తో వీటిని అమ్ముతున్నాడు. డోర్ డెలివరీ కూడా ఇస్తున్నాడు. ఇతను స్వతహాగా మెకానికల్ ఇంజినీరు కావడంతో బీఎంఆర్ ఫార్మ్స్ పేరుతో సోషల్ మీడియా మాధ్యమాల్లో కూడా పొట్టేళ్ల పెంపకం వాటి అమ్మకాల గురించి వివిధ సైట్‌లలో ఉంచాడు. దీని ద్వారా కూడా గిరాకీ లభిస్తున్నట్లు చెబుతున్నాడు. చలి, వర్షాకాలంలో జాగ్రత్తగా చూసుకోవాలి. శ్రద్ధంగా మేపుకుంటే బంగారంతో సమానమే అంటాడు. ఎక్కడెక్కడో ఉద్యోగాలు చేసే బదులు ఉన్న ఊరిలో పొలం ఉంటే వీటిని మేపుకుంటే హాయిగా బతుక్కోవచ్చని సంతోషంతో చెబుతాడు.



మధ్యాహ్నంవారిపల్లెలో ఉన్న మోహన్ కుమార్ రెడ్డి పొట్టేళ్ల ఫారం



పొట్టేళ్ల పెంపకం లాభదాయకం



పొట్టేళ్ల పెంపకం ఎందరికో జీవనోపాధిని ఇస్తోంది. మాంసానికి, మేలు జాతి విత్తన పొట్టేళ్లకు తరగని డిమాండు ఉంటోంది. పొట్టేళ్ల పెంపకం కొద్ది పాటి జాగ్రత్తలు పాటిస్తే బంగారంకు ఏమాత్రం తీసిపోదు. ప్రభుత్వం కూడా గొర్రెల పెంపకాన్ని ప్రోత్సహిస్తోంది. షెడ్ల నిర్మాణానికి, గొర్రెల, మేకల పెంపకానికి సబ్సిడీ రుణాలు ఇస్తోంది. నేషనల్ లైవ్ స్టాక్ మిషన్ (ఎన్‌ఎల్‌ఎం) కింద 50 శాతం రాయితీ ఉంది.

–నవీన్, పశువైద్యాధికారి, కురబలకోట



జీవితాన్ని కొత్త మలుపు తిప్పింది

మెకానికల్ ఇంజినీరుగా ఉద్యోగం చేసేటప్పుడు కర్నాటకతో పాటు కత్తర్‌లో పొట్టేళ్ల పెంపకం గురించి చూశా. ఉన్న ఊరి గాలికి ఏదీ సాటి రాదు. మెకానికల్ ఇంజినీరుగా ఎవరి వద్దో పని చేయడం ఎందుకని స్వయం ఉపాధి కింద ఈ పనిచేస్తున్నా. మూడు లేదా నాలుగు నెలల వయస్సు పొట్టేళ్ల పిల్లలను తీసుకు వస్తా. బరువు, సైజు, వయస్సును బట్టి రూ.12 వేల నుంచి రూ.14 వేలు పడుతుంది. ఇవి 12 నుంచి 15 కిలోల వరకు బరువు ఉంటాయి. వీటిని షెడ్డులో ఆర్నెళ్ల పాటు మేపుతా. 40 నుంచి 45 కిలోల బరువుకు వస్తాయి. సొంత పొలం. సొంత గడ్డి. కూలీల ఖర్చు లేదు. నెలకు ఎలా చూసుకున్నా ఆదాయంలక్షకు తగ్గదు.

–బి. మోహన్ కుమార్‌రెడ్డి, పొట్టేళ్ల ఫారం నిర్వాహకులు, మధ్యాహ్నంవారిపల్లె, కురబలకోట

మహిళను అవమానించిన కేసులో జైలు శిక్ష

రామాపురం/లక్కిరెడ్డిపల్లి : మహిళను అవమానించిన సంఘటనకు సంబంధించి నిందితుడికి కోర్టు జైలు శిక్ష, జరిమానా విధించింది. వివరాలు ఇలా.. మండలంలోని చిట్లూరు పంచాయతీ పాలన్నగారిపల్లెకు చెందిన వై.విశ్వనాథరెడ్డి , నరసింహారెడ్డి అనే అన్నదమ్ములు ఇంటి గేటు విషయంపై ఘర్షణ పడ్డారు. ఈ విషయంపై ఆ గ్రామానికి చెందిన రామాంజులురెడ్డి విశ్వనాథరెడ్డి ఇంటికి వెళ్లి గేటును తొలగించాలని అతని తల్లి రాములమ్మను కర్రతోకొట్టి అవమానించాడు. దీంతో బాధితురాలి ఫిర్యాదు మేరకు 2021 సంవత్సరం ఆగస్టు 26న పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసును లక్కిరెడ్డిపల్లె కోర్టు జడ్జి షేక్ ఫైజున్నిసా మంగళవారం విచారించారు. నేరం రుజువు కావడంతో ముద్దాయి రామాంజులు రెడ్డికి ఒక ఏడాది జైలు శిక్ష, రూ.4వేలు జరిమానా విధించినట్లు ఎస్ఐ కొండారెడ్డి తెలిపారు.

యువకుల మధ్య ఘర్షణ : ఒకరి మృతి


మృతి చెందిన ఫైరోజ్

రాయచోటిటౌన్ : రాయచోటి పట్టణంలో యువకుల మధ్య జరిగిన ఘర్షణలో ఫైరోజ్ (24) అనే యువకుడు మృతి చెందాడు. అర్బన్ సీఐ సుధాకర్ రెడ్డి కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. సోమవారం రాత్రి రాయచోటి పట్టణంలోని కుమ్మరమిట్ట సమీపంలో (నాజ్ థియేటర్) ఫైరోజ్, షామీర్‌ల మధ్య గొడవ చోటు చేసుకుంది. మరో వ్యక్తి వచ్చి ఈ గొడవను నివారించేందుకు ప్రయత్నించాడు. అయితే షామీర్ మద్యం మత్తులో ఫైరోజ్‌ను పదునైన కొయ్యతో పొత్తికడుపులో గట్టిగా పొడిచాడు. దీంతో ఆ యువకుడు తీవ్ర గాయాలతో పడిపోవడంతో స్థానికులు రాయచోటి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు ప్రాథమిక చికిత్స చేసి కడప రిమ్స్‌కు తరలించారు. మార్గ మధ్యంలో మృతి చెందాడు. గతంలో వీరి మధ్య మనస్పర్థలు ఉండేవని దీంతోనే ఈ గొడవ జరిగిందని సీఐ తెలిపారు. నిందితుడు పరారీలో ఉన్నట్లు తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

పెద్దతిప్పసముద్రం : మండలంలోని కందుకూరు సమీపంలో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో బాలచందర్ (31) తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసుల కథనం మేరకు మండలంలోని కాట్నగల్లు పంచాయతీ కాకిమారుపల్లికి చెందిన బాలచందర్ అనే రైతు చేలూరు నుంచి ఎరువుల బస్తాతో ద్విచక్ర వాహనంలో స్వగ్రామానికి వస్తుండగా సత్యసాయి జిల్లా కదిరి ఆర్టీసీ డిపోకు చెందిన బస్సు బెంగళూరుకు వెళుతూ కందుకూరు సమీపంలో ప్రమాదవశాత్తు ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ఈ ఘటనలో రైతు కాలు విరగడంతో 108 వాహనంలో బి.కొత్తకోట ప్రభుత్వాసుపత్రిలో ప్రథమ చికిత్స చేశారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించారని పోలీసులు తెలిపారు.

ఫుట్‌పాత్‌పైకి దూసుకెళ్లిన కారు

– నలుగురికి గాయాలు

పీలేరురూరల్ : కారు బీభత్సం సృష్టించడంతో నలుగురు తీవ్రంగా గాయపడ్డ సంఘటన పీలేరు పట్టణంలో చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఎల్‌బీఎస్ రోడ్డులో రోడ్డు పక్కన ఫుట్‌పాత్‌పై కొందరు చిన్న చిన్న పూల గంపలు పెట్టుకుని వ్యాపారం చేసుకునేవారు. మంగళవారం ఉదయం ఎవరూ ఊహించని రీతిలో ఓ కారు బీభత్సం సృష్టిస్తూ ఫుట్‌పాత్‌పైకి దూసుకువచ్చింది. అక్కడున్న జనంతో పాటు పూలగంపలు, ద్విచక్రవాహనాలను ఢీకొంటూ వెళ్లింది. ఈ ప్రమాదంలో రాజీవ్‌నగర్ కాలనీకి చెందిన అమరావతి (37), ఆమె కుమార్తె అమృతవర్షిణి (16), పూల వ్యాపారులు అన్నపూర్ణ (50), రాణెమ్మ (55) తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం హుటాహుటిన స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. నలుగురిని ప్రథమ చికిత్స అనంతరం తిరుపతికి తరలించారు. సీఐ మోహన్‌రెడ్డి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేశారు.

అంతర్ రాష్ట్ర నకిలీ బంగారం ముఠా అరెస్టు

- తక్కువ ధరకు బంగారం ఇస్తామని ఆశ చూపి మోసం
- నకిలీ పూసలతో తెలంగాణ వ్యక్తిని మోసగించిన వైనం
- బాధితుడి ఫిర్యాదుతో ట్రాప్ చేసి నిందితులను పట్టుకున్న పోలీసులు


ముఠా సభ్యుల అరెస్టు చూపుతున్న డీఎస్పీ కేశప్ప, సీఐ మహబూబ్‌బాషా

మదనపల్లె : లంకెబిందెలో లభించిన బంగారును తక్కువధరకు అమ్మేస్తామని ఆశచూపి, తెలంగాణ వాసిని మోసగించి, పెద్దమొత్తంలో డబ్బు కాజేసేందుకు ప్రయత్నించిన నకిలీ బంగారు అంతరాష్ట్ర ముఠాసభ్యుల గుట్టును మదనపల్లె పోలీసులు రట్టుచేశారు. బాధితుడి ఫిర్యాదుతో స్పందించిన పోలీసులు, స్థానిక యువత సాయం తీసుకుని, నగలు కొనుగోలు చేస్తామని నిందితులను మదనపల్లెకు రప్పించి, ట్రాప్‌చేసి సినీఫక్కీలో నేరుగా పట్టుకున్న ఘటన మంగళవారం జరిగింది. డీఎస్పీ కేశప్ప, వన్‌టౌన్ సీఐ మహబూబ్‌బాషా నకిలీ బంగారు అంతరాష్ట్ర ముఠా అరెస్ట్‌పై వెల్లడించిన వివరాలు... ఈనెల 19వ తేదీన హైదరాబాద్ అత్తాపూర్‌కు చెందిన పల్లెరాజుకు, ఆవుల వ్యాపారి, లారీ డ్రైవర్‌గా పాత పరిచయస్తుడైన వీరబల్లి మండలం తాటికుంటపల్లె షికారిపాళ్యంకు చెందిన రాణా రాజానాయక్(32) ఫోన్ చేశాడు. కర్నాటకలోని మైసూర్‌లో జేసీబీతో పనులు చేస్తుండగా, ఒక కుండ బయటపడిందని, దాన్ని పగులగొడితే అందులో బంగారు నగలు ఉన్నట్లు చెప్పాడు. ఈ విషయం తనకు, తన స్నేహితుడికి మాత్రమే తెలుసని, దొరికిన బంగారు నగలు ఇవే అంటూ వాట్సప్ వీడియో కాల్‌లో చూపించాడు. వీటిని తెలిసిన వారికెవరికైనా అమ్మి పెట్టాలని, లేకపోతే నీవే తక్కువ ధరకు కొనుక్కోవాల్సిందిగా చెప్పారు. నిజమని నమ్మిన పల్లెరాజు హైదరాబాద్ నుంచి రాజునాయక్‌ను కలిసేందుకు వచ్చాడు. బంగారు నగలను చెక్ చేసుకునేందుకు ఇవ్వాలని కోరితే, అడ్వాన్సుగా రూ.20,000 తీసుకుని 4 పూసలను ఇచ్చారు. వీటిని పరీక్షించితే అవి నకిలీగా తేలాయి. దీంతో పల్లెరాజు తనను ఉద్దేశపూర్వకంగా రాజునాయక్ మోసగించేందుకు ప్రయత్నించాడని తెలుసుకుని, తనకు జరిగిన మోసంపై వన్‌టౌన్ సీఐ మహబూబ్‌బాషాను కలిసి ఫిర్యాదుచేశాడు. దీంతో సీఐ మహబూబ్ బాషా నిందితులను పట్టుకునేందుకు స్పెషల్ పార్టీ సిబ్బందితో స్థానికంగా పరిచయం ఉన్న యువకులు భానుప్రకాష్, మణి సహాయం తీసుకున్నారు. నిందితులకు ఫోన్‌చేసి తాము రూ.20 లక్షలకు నగలు కొనుగోలు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని, తీసుకురావాల్సిందిగా కోరారు. దీంతో రాజునాయక్ తన ముఠాసభ్యులైన కర్నాటకలోని చిక్‌బళ్లాపూర్‌జిల్లా బాగేపల్లె తాలూకా చేలూరుకు చెందిన ప్లాస్టిక్ పూల వ్యాపారం చేసుకునే శివకృష్ణ(20), చిత్తూరు జిల్లా పుంగనూరు మండలం ఈడిగపల్లె పంచాయతీ షికారిపాళ్యంకు చెందిన బి.అర్జున్(21), పి.శివమణి(21), కర్నాటక రాష్ట్రం రాయల్పాడు మండలం అక్కిబిక్కికాలనీకి చెందిన శంకర(39), బన్నీ(19) వాల్మీకిపురం మండలం నగిరిమడుగు షికారిపాళ్యంకు చెంది, ప్రస్తుతం అక్కిబిక్కికాలనీలో స్థిరపడిన సత్యం (35)లతో కలిసి రెండుకేజీల నకిలీ బంగారు నగలను తీసుకుని వచ్చారు. ముందుగానే వేసుకున్న పథకం ప్రకారం పోలీసులు మామూలు దుస్తుల్లో, స్థానిక యువకులతో కలిసి నిందితులతో బేరసారాలు సాగిస్తుండగా, వన్‌టౌన్ సీఐ మహబూబ్‌బాషా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. పోలీసులను చూసి నిందితులు పారిపోయేందుకు ప్రయత్నించగా, సినీఫక్కీలో వెంబడించి పట్టుకున్నారు. ఒకరు పారిపోగా, మిగిలిన ఏడుగురిని అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి 9 సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులు అందరూ ప్లాస్టిక్ పూలు, పూసల వ్యాపారం చేసుకునే ఎస్టీ వర్గానికి చెందిన షికారీ కులస్తులు. వీరంతా ఒక ముఠాగా ఏర్పడి ప్రస్తుతం కర్నాటక రాయల్పాడు కేంద్రంగా నకిలీ బంగారం దందా నిర్వహిస్తున్నట్లు తెలిసిందన్నారు. వీరిని విచారిస్తే.. తాము స్థానికులతో వ్యాపారాలు నిర్వహించమని, తెలంగాణ, వైజాగ్, కాకినాడ, భీమవరానికి చెందిన బడాబాబులనే లక్ష్యంగా చేసుకుని కార్యకలాపాలు నిర్వహిస్తామని తెలిపారు. డీఎస్పీ కేశప్ప మాట్లాడుతూ.. దొరికిన నిందితుల్లో ఒకరు పాతనేరస్థుడని, వన్‌టౌన్‌లో ఇలాంటి మోసంలోనే కేసు నమోదైందన్నారు. తక్కువ ధరకు బంగారు నగలు వస్తాయని ఆశపడి డబ్బులు పోగొట్టుకోవద్దని సూచించారు. నకిలీ బంగారు అంతరాష్ట్ర ముఠాసభ్యులను అరెస్ట్ చేయడంలో సహకరించిన యువకులను అభినందించారు. స్పెషల్‌పార్టీ పోలీసులు చక్రి, శంకర, వెంకటేష్, జైనుద్దీన్, ప్రసాద్, భద్ర తదితరులను అభినందించి, ఎస్పీ రివార్డుకు సిఫారసు చేయనున్నట్లు తెలిపారు.

ఆలయాల్లో చోరీలకు పాల్పడిన దొంగల అరెస్టు

సుండుపల్లె (రాయచోటిటౌన్) : ఆలయాలలో చోరీలకు పాల్పడిన ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. ఈ మేరకు సుండుపల్లె పోలీస్ స్టేషన్‌లో డీఎస్పీ మహబూబ్‌బాషా విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. సత్యసాయి జిల్లా ఎన్‌పీ కుంట యర్రవంకపల్లె గ్రామానికి చెందిన ఆవుల సిరిమామిడప్ప అలియాస్ నీలమాలప్ప, కర్ణాటక రాష్ట్రం కమ్మసముద్రం గ్రామానికి చెందిన ఆవుల రామకృష్ణ, అన్నమయ్య జిల్లా లక్కిరెడ్డిపల్లె మండలం కోనంపేటకు చెందిన ఆవుల మల్లికార్జున అనే ముగ్గురు వివిధ ప్రాంతాలలో ఆలయాల తలుపులు పగలకొట్టి హుండీల్లోని డబ్బు, ఆభరణాలు దోచుకెళ్లారు. వీరు ముగ్గురు గత నెల 17వ తేదీ టి. సుండుపల్లె మండలం శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో హుండీ పగలకొట్టి వెండి ఆభరణాలు, డబ్బు దోచుకెళ్లారు. అలాగే నందలూరు మండలం అరవపల్లె దగ్గర ఉన్న వినాయకుడి గుడిలో హుండీ పగలకొట్టి రూ.4000 నగదు, రాయచోటి గంగమ్మ ఆలయంలో హుండీ పగలకొట్టి రూ.20,000 నగదు, పీలేరు పట్టణ పరిధిలో అంకాళ్లమ్మ ఆలయంలోని హుండీ పగలకొట్టి అమ్మవారి మెడలో ఉన్న తాళిబొట్టు, రూ.500 నగదు దోచుకెళ్లారు. కాగా నందలూరు సమీపంలోని శివాలయంలో చోరీకి పాల్పడుతున్న సమయంలో అక్కడే నిద్రిస్తున్న ఒక వ్యక్తి గట్టిగా కేకలు వేయగా అతనిపై రాళ్లతో దాడి చేశారు. వీరు చోరీలకు పాల్పడగా వచ్చిన డబ్బులతో జల్సాలు చేసేవారు. టెక్నాలజీ ఆధారంగా వీరి ఆచూకీ తెలుసుకొని రూరల్ సీఐ తులశీరాం, సుండుపల్లె ఎస్ఐ రామకృష్ణారెడ్డిలు ఎంతో చాకచక్యంగా వారిని పట్టుకున్నట్లు తెలిపారు. వీరితో పాటు సుండుపల్లె పోలీస్ సిబ్బంది దీప్లానాయక్, శివరాజేంద్ర, నరసింహులు, శ్రీనివాసులు సహకరించారని తెలిపారు. వీరిని అభినందించడంతో పాటు జిల్లా ఎస్పీ ద్వారా రివార్డుకు సిఫార్సు చేస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు.

రోడ్డుప్రమాదంలో ట్రాక్టర్ డ్రైవర్ మృతి

మదనపల్లె : రోడ్డుప్రమాదంలో ఆటో ఢీకొని ట్రాక్టర్ డ్రైవర్ మృతిచెందిన సంఘటన మంగళవారం రాత్రి మదనపల్లె పట్టణంలో జరిగింది. అనపగుట్టకు చెందిన ఇటుకబట్టీ కార్మికుడు వెంకటరమణ, ఈశ్వరమ్మ దంపతుల కుమారుడు జి.జగదీష్(40), భార్య రేవతి, పిల్లలతో కలిసి పట్టణంలోని నక్కలదిన్నెలో నివాసం ఉంటున్నాడు. ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తూ జీవిస్తున్నాడు. మంగళవారం రాత్రి అనపగుట్టలోని తల్లిదండ్రుల వద్దకు వెళ్లి తిరిగి ద్విచక్రవాహనంలో నక్కలదిన్నెకు వస్తుండగా, మార్గమధ్యంలోని టిప్పుసుల్తాన్ కాంప్లెక్స్- మార్కెట్‌యార్డు మధ్యన ఆటో వేగంగా వచ్చి ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ జగదీష్‌ను ఢీకొన్న ఆటోలోనే ప్రమాదానికి కారకుడైన డ్రైవర్ జిల్లా ఆస్పత్రికి తీసుకువచ్చాడు. పరీక్షించిన వైద్యులు జగదీష్ అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. దీంతో అక్కడి నుంచి ఆటోతో పాటు డ్రైవర్ పారిపోయాడు. కాగా, మృతునికి ఇద్దరు కుమారులు నాగార్జున(3), రెండో కుమారుడు ఐదునెలల బాబు ఉన్నారు. ప్రమాదవార్త తెలుసుకున్న కుటుంబ సభ్యులు ఆస్పత్రికి వచ్చి కన్నీరుమున్నీరయ్యారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. టూటౌన్ పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. మృతుడి తండ్రి వెంకటరమణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

717 అంగన్‌వాడీ సెంటర్లకు నిధులు మంజూరు

ఐసీడీఎస్ పీడీ, డీపీఓ ధనలక్ష్మి

మదనపల్లె : ప్రభుత్వ పాఠశాలల్లో మాదిరిగా అంగన్‌వాడీల్లోనూ ప్రవేశపెట్టిన నాడు-నేడు పథకం ఫేజ్-2ఏ కింద అన్నమయ్య జిల్లాలోని 11 ప్రాజెక్టుల పరిధిలో 717 అంగన్‌వాడీ కేంద్రాలకు మరమ్మతులకు సంబంధించి నిధులు మంజూరు చేసేందుకు రాష్ట్రప్రభుత్వం నిర్ణయించిందని ఐసీడీఎస్ పీడీ, డీపీఓ మిద్దింటి ధనలక్ష్మి తెలిపారు. మంగళవారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో మదనపల్లె, బి.కొత్తకోట, తంబళ్లపల్లె ప్రాజెక్ట్ పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు, సూపర్‌వైజర్లతో స్త్రీ శిశు, సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు, నాడు-నేడు కింద చేయాల్సిన పనులపై సిబ్బందికి శిక్షణా, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... జిల్లాలోని 11 ఐసీడీఎస్ ప్రాజెక్టుల్లోని సిబ్బందికి బుధవారం కలికిరి, పీలేరు, గురువారం రాయచోటి, లక్కిరెడ్డిపల్లె, శుక్రవారం రైల్వేకోడూరు, సుండుపల్లి, చిట్వేల్, రాజంపేట ప్రాజెక్టుల పరిధిలో శిక్షణా, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. జిల్లాలో నాడు-నేడు పథకం ఫేజ్-2లో 141 నూతన భవనాలు మంజూరయ్యాయని, కో-లొకేటెడ్ కింద 19, శాటిలైట్ సెంటర్స్ 17, రిపేర్లు..86 కేంద్రాల్లో ఐదు స్టేజీల్లో వివిధ దశల్లో పనులు జరుగుతున్నాయన్నారు. ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో సుందరీకరణలో భాగంగా ఎలక్ట్రిఫికేషన్, తాగునీరు, ఫ్లోర్, టాయిలెట్స్, ఇతర మౌలిక వసతుల కల్పనకు రూ.5లక్షల వరకు నిధులు మంజూరు చేస్తున్నామన్నారు. జిల్లాలోని 11 ప్రాజెక్టుల పరిధిలోని 2,275 అంగన్‌వాడీ కేంద్రాల్లో అన్ని సేవలు సమర్థవంతంగా అందిస్తూ, పనితీరును మెరుగుపరుచుకోవడంతో... ప్రగతిలో రాష్ట్రంలో అన్నమయ్య జిల్లా మొదటి ఐదో స్థానంలో నిలిచిందన్నారు. కార్యక్రమంలో సీడీపీఓలు సుజాత, నాగవేణి, నాగరాజు, సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.


అంగన్‌వాడీల శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న పీడీ ధనలక్ష్మి

దివ్యాంగ పిల్లల విద్యాభివృద్ధికి ప్రభుత్వం చేయూత

జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

రాయచోటి : ప్రత్యేక అవసరాల దివ్యాంగ పిల్లల విద్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం చేయూతనిస్తోందని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ అన్నారు. మంగళవారం రాయచోటి కలెక్టరేట్‌లోని స్పందన హాలులో అన్నమయ్య జిల్లా సమగ్ర శిక్ష సమ్మిళిత విద్య తరపున దృష్టి వినికిడి, ప్రత్యేక అవసరాల దివ్యాంగ పిల్లలకు, వారికి బోధించే ఉన్నత పాఠశాల ప్రత్యేక సహాయకులకు, ప్రతి మండలంలో ఉన్న భవిత కేంద్రాల సమగ్ర విద్య వనరుల వ్యక్తులకు ట్యాబులు పంపిణీ చేశారు. ఈ ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా మొదటిసారిగా దివ్యాంగ పిల్లలకు డిజిటల్ పరీక్షా విధానం మన రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిందన్నారు. డిజిటల్ విద్యను అందించడంలో వారి విద్యా లక్ష్యాలను సంపూర్ణంగా పొందటానికి ట్యాబులు ఎంతో ఉపయోగపడతాయన్నారు. దివ్యాంగులు సాధారణ విద్యార్థులతో సమానంగా తమ అభ్యసన స్థాయిని పెంచుకునేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఈఓ శ్రీరామ్‌పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.


ట్యాబులు అందుకున్న దృష్టి, వినికిడి, ప్రత్యేక అవసరాల దివ్యాంగ పిల్లలతో జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

బైక్ అదుపుతప్పి గాయాలు

మదనపల్లె : బైక్ అదుపుతప్పి తండ్రీకొడుకు గాయపడిన సంఘటన మంగళవారం మదనపల్లెలో జరిగింది. పెద్దపంజాణి మండలం రాయలపేట పంచాయతీ తూర్పుపల్లెకు చెందిన వెంకటాచలపతి(52) తన కుమారుడు రాజేష్(26)తో కలిసి టైల్స్ కొనుగోలు చేసేందుకు మదనపల్లెకు వచ్చారు. తిరిగి సాయంత్రం ద్విచక్రవాహనంలో స్వగ్రామానికి బయలుదేరారు. మార్గమధ్యంలోని మదనపల్లె మున్సిపల్ డంపింగ్‌యార్డు వద్ద కుక్క వాహనానికి అడ్డుగా రావడంతో అదుపుతప్పి కిందపడి గాయపడ్డారు. గమనించిన స్థానికులు ఆస్పత్రికి తరలించారు.

ఒంటరి జీవితం భరించలేక వృద్ధుడి ఆత్మహత్య

రాయచోటిటౌన్ : ఒంటరి జీవితాన్ని భరించలేక గుండ్లపల్లె కృష్ణయ్య (80) అనే వృద్ధుడు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. అర్బన్ ఎస్ఐ ఇనాయతుల్లా కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి, రాయచోటి పట్టణంలోని సింగపూర్ వీధిలో వీరబల్లి మండలం మట్లి గ్రామం తొగటపల్లెకు చెందిన కృష్ణయ్యకు ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. వీరందరూ జీవనోపాధి కోసం చాలా సంవత్సరాల క్రితం మదనపల్లెకు వెళ్లి అక్కడే స్థిరపడ్డారు. కొన్నేళ్ల క్రితం కృష్ణయ్య భార్య మృతి చెందింది. అప్పటినుంచి ఇతను సింగపూర్ వీధిలో తన సొంత ఇంటిలో ఒంటరిగా ఉంటున్నాడు. అయితే అప్పుడప్పుడూ మదనపల్లెకు వెళ్లి పిల్లలను చూసి వచ్చేవాడు. వారం రోజుల క్రితం రాయచోటికి వచ్చాడు. ఈ నేపథ్యంలో మూడు రోజుల క్రితం తలుపులు బిగించుకొని ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మంగళవారం ఇంటిలో నుంచి తీవ్రమైన దుర్వాసన వస్తుండటంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు వచ్చి తలుపులు పగలకొట్టి లోపలికి వెళ్లి చూడగా అప్పటికే శరీరం అంతా కుళ్లిపోయి ఉంది. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆయన మృతి చెందిన విషయాన్ని కుమార్తెలకు, కుమారుడికి తెలిపామని పోలీసులు తెలిపారు.

నవశకం



మా కుటుంబానికి ఎంతో మేలు జరిగింది



నేను, నా భర్త కూలి పనులు చేసుకుని కాలం వెళ్లదీస్తున్నాం. గత టీడీపీ పాలనలో పక్కా గృహం మంజూరైంది.అష్ట కష్టాలు పడి ఇంటి పైకప్పు వరకు నిర్మాణం చేపట్టాం. అయితే ఎలాంటి బిల్లులు మంజూరు కాలేదు. జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా సచివాలయ సిబ్బంది ఇంటి వద్దకే వచ్చి మా సమస్య తెలుసుకున్నారు. అనంతరం మాకు ఇంటి బిల్లులు రూ.1.60 లక్షల దాకా మంజూరు కావడంతో అసంపూర్తిగా ఉన్న ఇంటి నిర్మాణం పూర్తి చేసుకున్నాం. తుది బిల్లు మాత్రం రావాల్సి ఉంది. అలాగే పలు ప్రభుత్వ పథకాలన్నీ మా కుటుంబానికి వర్తిస్తున్నాయి. జగనన్న పాలనలో మా కుటుంబానికెంతో మేలు జరిగింది.

– కొమ్ము స్వప్న, పెద్దతిప్పసముద్రం

అధునాతన వసతులతో ప్రభుత్వ పాఠశాల



గతంలో మా పాఠశాలలో సరైన భవనాలు లేవు. తరగతి గదులు లేక చెట్ల కింద చదువుకునే పరిస్థితి. బాలికలు మరుగుదొడ్లు లేక అవస్థలు పడేవారు. వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయిన తర్వాత అమలు చేసిన నాడు-నేడు పథకంలో మా పాఠశాల రూపురేఖలు మారిపోయాయి. 6 నుంచి 10 తరగతులకు ఐఎఫ్‌పి ప్యానల్ బోర్డుల ద్వారా బోధిస్తున్నాము. 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు ఇచ్చారు. నాణ్యమైన విద్యతో పాటు భోజనం అందిస్తుండంతో పిల్లలు సంతోషంగా బడికి వస్తున్నారు. గతంలో పాఠశాలలో వసతులు లేక ఇబ్బందులు పడేవారు. పాఠశాలకు వచ్చే పిల్లల సంఖ్య పెరిగింది. తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

– ఆర్.వి.రమణ, ఉపాధ్యాయుడు, జెడ్పీహెచ్ఎస్. మదనపల్లె.

వివాహిత ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : కుటుంబ సమస్యలతో వివాహిత ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన మంగళవారం మదనపల్లె పట్టణంలో జరిగింది. సుభాష్ వీధి ఐదు కొళాయిల వద్ద నివసిస్తున్న వేణుగోపాల్ భార్య సుజాత(35) భర్తతో గొడవపడి నిద్రమాత్రలు మింగింది. గమనించిన కుటుంబ సభ్యులు స్థానిక జిల్లా ఆస్పత్రికి తరలించారు. టూటౌన్ పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.